ఎట్టకేలకు ఐఎబి

హెచ్ఎల్సీ పరిధిలో నీరు లేక ముదిరిపోయిన వరినారు

◆సీజన్ ముగుస్తుందనగా సమావేశం
◆ఆయకట్టు రైతులకు ఇప్పటికే ఇక్కట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం ఎట్టకేలకు ఖరారైంది. గురువారం ఉదయం జిల్లా పరిషత్ డిపిసి హాలులో ఈ సమావేశం జరుగనుంది. సెప్టంబర్‌తో ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న సమయంలో ఈ సమావేశం జరుగనుంది. సాధారణం ఆగస్టు మొదటి వారంలోనే ఈ సమావేశం నిర్వహించేవారు. ఇక్కడ తీసుకున్న నిర్ణయాల ప్రకారమే నీటి కేటాయింపులు జరుగుతాయి. కాని ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సాగు, తాగునీటి కష్టాలు అధికంగానే ఉన్నాయి. అయితే తుంగభద్ర డ్యామ్‌కూ నీరు ఆలస్యంగా రావడంతో నీటి విడుదల్లోనూ కొంత జాప్యం జరిగింది. ఇక ఐఎబి సమావేశం కూడా ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న సమయంలో జరుగుతుండటం గమనార్హం.

ఆయకట్టు రైతులకు తప్పని ఇబ్బందులు

ఆయకట్టు రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కిందనున్న ఆయకట్టే నీరందక నార ముదిరిపోయి పంట వేసుకోలేని పరిస్థితి నెలకొంది. గుంతకల్లు బ్రాంచ్ కాలువ కింద ఇదే పరిస్థితి నెలకొంది. డిస్ట్రిబ్యూటరీలకు పూర్తి స్థాయి నీరు లేక వరి పంటకు నీరందటం లేదు. ఇక మిడ్ పెన్నార్ దక్షిణ కాలువకు నీరు ఎప్పుడు అందుతుందో లేదో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. హంద్రీనీవా రైతుల పరిస్థితి అయోమయంగానే ఉంది. శ్రీశైలం డ్యామ్‌కు పుష్కలంగా నీరు రాలేదు. ఎప్పుడు వస్తాయో ఎప్పుడూ నీరు ఆగిపోతుందో తెలియక ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకోవాలో లేదో తెలియకుండా ఉంది. ఒక వైపు వర్షాభావ పరిస్థితులు మరోవైపు ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొన్నాయి.

కాలువలు ఎక్కడి పరిస్థితి అక్కడే

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి దయనీయంగా మారింది. ఆధునీకరణ పనులు మధ్యలో ఆపివేసియున్నారు. నాలుగేళ్లుగా కనీసం నిర్వహణ కూడా నోచుకోలేదు. ఎప్పుడు గండిపడుతుందోనన్న గుబులు అధికారుల్లో ఉంది. ఈ ఏడాది వరుసగా మూడుసార్లు కాలువకు గండిపడింది. అసలే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి ఈ సమయంలోనూ పూర్తి స్థాయిలో నీటిని తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది పుష్కలంగా నీరొచ్చినా నిలువ చేసుకునే సామర్థ్యం లేక వృథాగా నదిలోకి వంద టిఎంసిల వరకు వెళ్ళింది. ఇక హంద్రీనీవా ఆధునీకరణ చేపడతామని ప్రభుత్వం ప్రకటించింది. గత ఐఎబి సమావేశాల్లో ఈ అంశాలపై నేతలు చర్చించారు. ప్రభుత్వం టెండర్లు పిలిచింది. కాని ఇప్పటికీ పనులు ప్రారంభమవలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. ప్రతి సమావేశంలోనూ నేతలు ప్రాంతాల వారీగా విడిపోయి నీటి కోసం వాదనలు చేసుకోవడం మినహా శాశ్వత పరిష్కారానికి తీసుకున్న చర్యలేవి ఉండటం లేదు.

కళ్లు మూపించి... కాజేద్దామనుకుని..!?

◆ డిఎంఎ పర్యటనలో కార్పొరేషన్ అధికారి కక్కుర్తి
◆ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఉన్నతాధికారి హెచ్చరిక
◆ తీసుకెళ్లిన సామగ్రి అప్పగింత

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ కోటేశ్వరరావు ఇటీవల భూ రీ సర్వే శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనంతపురం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నగర శివారులోని ఎస్‌జె.ఆర్ ఫంక్షన్ హాల్లో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఫంక్షన్ హాల్ నిర్వహణ వ్యయం టౌన్ ప్లానింగ్ అధికారులు సర్దుబాటు చేయించారు. డిఎంఎ రాక సందర్భంగా వేదికను సుందరంగా అలంకరించేందుకు అవసరమైన పూల కుండీలు, అలంకరణ సామగ్రిని కొనుగోలు చేశారు. 1200 మంది సచివాలయ ప్లానర్స్, ఇతరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వీరికి శిక్షణ తరగతుల సమయంలో స్నాక్స్, కాఫీ, టీలు అందజేయడానికి రూ.50 వేలకుపైగా వ్యయం చేశారు. జాంగ్రీ, సమోసా, టీ వారికి సరఫరా చేశారు. ఇక్కడ వరకు అంతా బాగానే ఉంది. ఆ తరువాతనే అసలు అవినీతి కథకు తెరలేచింది. ఆఫీసు నిర్వహణాధికారి ఒకరు వీటిని కాజేసేందుకు తెరలేపారు. వేదికపై అమర్చిన సామగ్రిని పూల కుండీల సంచుల్లో ఎక్కించి ఇంటికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇది చాలదన్నట్లు సమోసా, జాంగ్రీ ప్యాకెట్లను సైతం తరలించినట్లు తెలుస్తోంది. కమిషనర్ భాగ్యలక్ష్మి కొంతమంది కిందిస్థాయి అధికారుల ద్వారా నిర్వాకాలు తెలుసుకుని ముందు జాగ్రత్త చర్యగా వేదికపై అమర్చిన వస్తు సామగ్రి వివరాలను ముందుగానే నమోదు చేయించినట్లు తెలుస్తోంది. బిల్లులు నామినేషన్ పద్ధతిలో ఉంచటంతో వాటిని పరిశీలించి వివరాలు ఆరా తీసినట్లు తెలుస్తోంది. అవి గల్లంతు కావడంతో ఎక్కడికెళ్లాయని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగితో వాకబు చేశారు. దీంతో సదరు పర్యవేక్షణాధికారి కక్కుర్తి బాగోతం వెలుగులోకి వచ్చాయి. దీనిపై కమిషనర్ భాగ్యలక్ష్మి నేరుగా ఆఫీస్ పర్యవేక్షణ అధికారికి ఫోన్ చేసి డిఎంఎ రాక సందర్భంగా వేదికపై ఏర్పాటుచేసిన వస్తు సామగ్రి అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి అందచేయకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. దీంతో సదరు అధికారి తీసుకెళ్లిన వస్తువులను మరుసటి రోజు ఉదయం కార్యాలయానికి తీసుకువచ్చినట్లు తెలిసింది. సదరు అధికారి స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా 'నా మట్టి నా దేశం' కార్యక్రమం సమయంలో విభాగాధికారితో సెలవు మంజూరు చేయించుకుని వెళ్లారు. ముఖ్యమైన కార్యక్రమాల సందర్భంగా ఆఫీసు నిర్వహణ అధికారి లేకపోవటం, ఆయనకు సెలవు మంజూరు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారి నేరుగా ఫోన్ చేసి విధులకు రమ్మని ఆదేశించారు. సదరు పర్యవేక్షణ అధికారికి విభాగాధికారి అండదండలు పుష్కలంగా ఉండటంతోనే ఆయన ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే భావన కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. గతంలో ఈయనకు ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బాధ్యతలు అప్పగించినా సరిగా విధులు నిర్వహించకపోవడంతో తిరిగి మరో అధికారికిగా ఆ విధులు అప్పగించారు. ఏ విధులు అప్పగించినా వాటిని ఆ అధికారి సక్రమంగా నిర్వహించడం లేదనే భావన ఆయనపై ఉంది. సాక్షాత్తు మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ పర్యటనలోనే సదరు ఆఫీస్ పర్యవేక్షణ అధికారి కక్కుర్తి బాగోతాలు వెలుగులోకి రావడం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. ఈ అంశం మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ దృష్టికి వెళ్తే అనంతపురం కార్పొరేషన్ పరువు గంగలో కలుస్తుందంటూ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సమావేశంలో పాల్గొన్న సహకార సంఘాల సభ్యులు, అధికారులు

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-అనంతపురం

సహకార సంఘాల అభివృద్ధిలో సహకార పరపతి సంఘాల పాలకవర్గం సభ్యులు నిర్ధష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని సహకార సంఘం నాయకులు తెలిపారు. రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం, అనంతపురం సబ్ డివిజన్ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకవర్గ సభ్యులకు సహకార విద్యాశిబిరం నిర్వహణ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించన ఈ కార్యక్రమానికి అనంతపురం జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎం.నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు అభివద్ధి చెంది లాభాల బాటలో పయనించాలంటే వ్యాపార ప్రణాళికను సమర్థవంతంగా తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ స్థాయిల అధికారులు సభ్యుల హక్కులు, భాధ్యతలు, పాలకవర్గం హక్కులు, భాధ్యతలు, సమావేశాల ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణ అధికారి రామ్‌ప్రసాద్, సహకార శిక్షణ కేంద్రం అధ్యాపకులు ఎస్ఎల్.రాజారెడ్డి, ఎస్ఎల్ఎస్టి శ్రీనివాస్‌తో పాటు సబ్ డివిజన్ పరిధిలోని ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, బీటెక్ మొదటి సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్20) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల అయ్యాయి. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్ సైట్ http://jntu-aresults.ac.inను సంప్రదించాలని డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

నేడు 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై సదస్సు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రతిపాదిస్తున్న వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఏజి.రాజమోహన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం తొందరపడుతోందన్నారు. ఈ అంశంపై వివరంగా తెలియాల్సి ఉందన్నారు. అందు కోసం నేడు ఏపీ ఎన్జీఓ హోంలో గురువారం నాడు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ప్రిన్సిపల్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యకర్త ఎ.చంద్రశేఖర్ ముఖ్య వక్తగా హాజరవుతున్నట్లు తెలిపారు. మేధావులు, ప్రజా సంఘాలు, కవులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కక్కలపల్లి కాలనీ సర్పంచి జి.కృష్ణయ్య


నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న సర్పంచి కృష్ణయ్య

ప్రజాశక్తి -అనంతపురం

అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని కక్కలపల్లి సర్పంచి జి.కృష్ణయ్య పేర్కొన్నారు. పంచాయతీలో నూతనంగా మంజూరయిన పింఛన్లను బుధవారం నాడు లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పారు. పింఛన్లు పొందని అర్హులు ఎవరైనా ఉంటే వాలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరకాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి బండి రమేష్, ఎంపిటీసీ జూటూరు పెన్నోబులేసు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్‌తో గొర్రెల కాపరులకు ప్రయోజనం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

గొర్రెలు, మేకలు తదితర వాటికి ఇన్సూరెన్స్ చేయించుకోవడం ఎంతో ప్రయోజనం అని, కాపర్ల తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకుని ప్రమాద బీమా లబ్ధిని పొందాలని ఉమ్మడి అనంతపురం జిల్లా గొర్రెల మేకల సహకార సొసైటీ, ఫెడరేషన్ చైర్మన్ పి.నరసింహ గౌడ్ తెలిపారు. జిల్లా పశు సంవర్ధక శాఖ సంచాలకుల కార్యాలయంలో బుధవారం ఉదయం జిల్లా మేకల సహకార సొసైటీ ఫెడరేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా గొర్రెల మేకల సహకార సొసైటీ, ఫెడరేషన్ చైర్మన్ పి.నరసింహ గౌడ్, డైరెక్టర్ శ్రీలత, సహకార సొసైటీ ఆడిటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వివిధ కారణాలతో చనిపోయిన గొర్రెలు, మేకలు, ఆవులు, ఎనుములకు రెండు నెలల క్రితం ఇన్సూరెన్స్ నిధులు రూ.32.30 మంజూరు అయ్యాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నేషనల్ కోపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రానికి మంజూరైన రూ.88.11 కోట్ల నిధులు త్వరగా గొర్రెల మేకల సహకార సొసైటీ అండ్ ఫెడరేషన్ ఖాతాకు జమ చేయాలని కోరారు. గొర్రెలు, మేకలు, పశువులకు వ్యాపించే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కాపరులకు సూచించారు. జీవాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. పశుసంవర్ధకశాఖ అధికారులు తులసి రామ్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, గోవింద్ తది తరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపర్ల సంఘ సభ్యుడు బి.కిష్టప్ప, బోడప్ప, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహగౌడ్

చిరుధాన్యాలు ఆరోగ్య ప్రదాయం

◆ ఎఆర్ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్టు సివి.చంద్రమోహన్‌రెడ్డి ◆ హోటళ్లలో చిరుధాన్యాల వంటపై ఎఎఫ్ ఎకాలజీ శిక్షణ

ప్రజాశక్తి-ఆత్మకూరు

చిరు ధాన్యాలను ఆహారంలో తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని ఎఆర్ఎస్ రేకులకుంట ప్రిన్సిపాల్ సైంటిస్టు సివి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో బుధవారం నాడు ఆత్మకూరు మండలంలోని ఒడ్డుపల్లి గ్రామంలో చిరుధాన్యల వంటకం, వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యామ్నాయ జీవనోపాధుల కోఆర్డినేటర్ రిజ్వాన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో హోటళ్లు నిర్వహిస్తున్న మహిళలు, సస్యమిత్ర గ్రూపు సభ్యులకు చిరుధాన్యలతో వంటకాలు చేయడంపై అవగాహన, శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రమోహన్‌రెడ్డి చిరుధాన్యల వాడకం ఆవశ్యకతను తెలియజేశారు. చిరుధాన్యల అవసరాన్ని ప్రపంచం గుర్తించిందని చెప్పారు. అందుకే ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యల దినోత్సవంగా నిర్ణయించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పంట సాగును ప్రోత్సహిస్తున్నాయన్నారు. దీని సాగు వలన పెట్టుబడులు తక్కువ, రాబడి అధికంగానే ఉంటుందన్నారు. తగినంత విలువ రావాలంటే వ్యాల్యూ అడిషన్ స్థానికంగా జరిగితే మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. ఆ ఉద్దేశంతో ఎఎఫ్ ఎకాలజీ గ్రామీణ ప్రాంతాల్లోనూ హోటల్

చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఆర్ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ చంద్రమోహన్‌రెడ్డి

నిర్వాహకులను పిలిపించి అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. చిరుధాన్యల వంటకం చేసే సమయంలో సాధారణ వంటల్లాగా కాకుండా కొన్ని మెళకువలు పాటించాల్సిన అవసరం ఉంటుందన్నారు. అప్పుడే అవి రుచిగానూ ఉంటాయని వివరించారు. వాటిని ఇక్కడ తెలుసుకుని మీరు నిర్వహించే హోటళ్లలోనూ చేసే విధంగా ప్రయత్నించాలని సూచించారు. చిరుధాన్యలకు ఇప్పుడు అంతర్జాతీయంగానూ మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రధాన నగరాలు, పట్టణాల్లోనూ దీని వాడకంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. కావున ఈ రంగంలోకి గ్రామీణ మహిళలు రాణించడం ద్వారా ప్రయోజనం పొందడమే కాకుండా ఆరోగ్యం మెరుగుపరుచుకునేందుకు వీలుంటుందన్నారు. ఎఎఫ్ ఎకాలజీ కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎస్.రమేష్ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు వేరువేరు ప్రాంతాల్లో జరుగుతాయని చెప్పారు. రైతులకు వాల్యూ అడిషన్ భాగంగా ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. స్థానికంగా వాడకం పెరగడం ద్వారా రైతులకు మద్దతు ధర లభించే వీలుంటుందన్నారు. వర్షాభావ మెట్ట ప్రాంతాలైన అనంతపురం జిల్లా వంటి చోట్ల చిరుధాన్యల సాగుకు ఎంతో అనుకూలమని వివరించారు. ఈ కార్యక్రమంలో సస్యమిత్ర గ్రూపు సభ్యులు, ఎఎఫ్ ఎకాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలు లేని జిల్లాగా మారుద్దాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బాల్య వివాహాలు లేని జిల్లాగా అనంతను మారుద్దామని బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్ తెలిపారు. అనంతపురం నగరంలోని పెన్నార్ భవన్ సమావేశ భవనంలో జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలు అందరూ బడిలో ఉండాలన్నారు. ఏ ఒక్కరూ డ్రాప్ అవుట్ అవ్వడానికి అవకాశం లేదన్నారు. బడిబయట ఉన్న పిల్లలని సీఆర్పీల చేత సర్వే చేయించి బడిలో చేర్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు అందరి చేత కమ్యూనిటీ లెవెల్ అవేర్నెస్‌లు ఏర్పాటుచేసి విద్య ప్రాముఖ్యతను తెలియజేసి, పిల్లలను చదువుకు పంపేలాగా పేరెంట్స్‌ను ప్రోత్సహించాలని వారు పేర్కొన్నారు. బాల్యవివాహాలు లేని జిల్లాగా అనంతపురంను తీర్చిదిద్దాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బిఎం.శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాలకు రెండు మూడు రోజులు డ్రాప్ అవుట్ అయినటువంటి పిల్లలందరినీ గుర్తించి బాల్య వివాహం జరిగే అవకాశం ఉన్నట్లయితే వెంటనే వాళ్లని అక్కడి నుంచి తీసుకొచ్చి పునరావాసం కల్పించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని ఏ పాఠశాలలో కూడా బాలల హక్కుల ఉల్లంఘన జరగకుండా తగిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లా బాలల పరిరక్షణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, సిడబ్ల్యూసి చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జిల్లా బాలల పరిరక్షణ సమితి డిసిపిఒ సుబ్రమణ్యం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణమాచారి, కౌన్సిలర్లు సురేష్, ఇర్ఫాన్, డీసీపీయూ సోషల్ వర్కర్ వెంకట కుమార్ పాల్గొన్నారు.

బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ఎయిడ్స్‌పై విద్యార్థులకు క్విజ్ పోటీలు

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు యువతలో హెచ్ఐవి,ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించేందుకు రాజేంద్ర మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో 8,9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ విద్యా శాఖాధికారి పద్మ ప్రియ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న విద్యార్థులకు హెచ్ఐవి/ ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ డిపిఎం వెంకట రత్నం, జిల్లా సూపర్వైజర్ జివి.రమణ, మురళి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15న విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల పరిధిలోని దిమ్మగుడి హైస్కూల్‌లో ఈనెల15న ఎస్‌జిఎఫ్ఐ పాఠశాల స్థాయి అండర్-14, అండర్-17 క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. 15న ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఇందులో కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, వాలీబాల్, యోగ క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారిని మండల స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు, ఉపాధ్యాయులు రాజేష్, రామంజి, లింగరాజు, బాషా, వీరా పాల్గొన్నారు.

ఈ పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండల పరిధిలోని చియ్యేడు, పూలకుంట గ్రామాల్లో జరుగుతున్న ఈ పంట నమోదును మండల వ్యవసాయ అధికారిని శశికళ బుధవారం పరిశీలించారు. కంది, వేరుశనగ పంటలను పరిశీలించారు. రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణి చేయాలనీ, పిఎం కిసాన్, ఈకెవైసి, కౌలు రైతులకు రుణాలు ఇప్పించే విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమములో వ్యవసాయ విస్తరణ అధికారి మురళి, ఆర్‌బికె భువనేశ్వరి, కవిత పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని గుత్తి వ్యవసాయశాఖ ఎడిఎ వెంకటరాముడు బుధవారం పరిశీలించారు. గ్రామంలోని 15వ డిస్ట్రిబ్యూటరీ కాలువ సమీపంలో రైతులు సాగుచేసిన పలు పలు పంటలను ఈ క్రాప్ నమోదు చేయించారు. నిర్దేశించుకున్న సమయంలోపు పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన గ్రామంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన వాటికి కంప్యూటర్ రసీదులు తప్పక ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి మల్లీశ్వరి, ఆర్‌బికె విఏవో జయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అధినేతకు అండగా తెలుగుతమ్ముళ్ల నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-తాడిపత్రి

ఎపిలో ప్రస్తుతం బ్రిటిష్ హయాంలో కంటే దారుణంగా పాలన నడుస్తోందని మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ బుధవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి అస్మిత్‌రెడ్డి, కార్యకర్తలతో కలిసి ఆయన మౌన దీక్ష నిర్వహించారు. జెసి మాట్లాడుతూ చంద్రబాబుకు బెయిల్ నిరాకరించిన వెంటనే వైసిపి శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద టపాసులు పేల్చి సంబరాలు చేసుకోవడం పోలీసులకు కనపడలేదని నిలదీశారు. చంద్రబాబు అరెస్టుతో టిడిపికి 3 నుంచి 5 శాతం ఓటింగ్ పెరిగిందన్నారు. జైలుకు పోయి వచ్చిన వారందరూ అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజాసేవలో అలసిపోయిన చంద్రబాబు ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవాలని ఏమీ కాదని సూచించారు. అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ న్యాయానికి, ధర్మానికి అర్థం లేని రోజుల్లో ఎంత గొంతు చించుకొన్నా పలికే వారు లేరని, దీంతో మౌన దీక్ష చేపట్టామన్నారు. జైలుకెళ్ళి వచ్చిన జగన్ చంద్రబాబును ఉద్దేశపూర్వకంగా జైలులో పెట్టించాడన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి గెలుస్తుందని, చంద్రబాబు సిఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమం పట్టని సిఎం జగన్ : పరిటాల సునీత

అనంతపురం : సిఎం జగన్‌కు కుట్రలు, కుతంత్రాలు తప్ప ప్రజా సంక్షేమం పట్టదని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రూరల్ మండల టిడిపి కన్వీనర్ జింకా సూర్యనారాయణ నేతృత్వంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజల్లో టిడిపికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని, వచ్చే ఎన్నికల్లో వైసిపికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, లక్ష్మినారాయణ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

అధికార మదంతో సిఎం జగన్: ప్రభాకర్‌చౌదరి

అనంతపురం కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అధికార మదంతో ప్రవర్తిస్తున్నారని, అధికారం పోయేంత వరకు ఈ మదం తగ్గదని అనంతపురం మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బాబుకు తోడుగా ఒక నియంతపై పోరాటం' కోసం మేము సైతం అంటూ అనంతపురం అర్బన్ నియోజకవర్గం టిడిపి నేతల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను ప్రభాకర్ చౌదరి ప్రారంభించి మాట్లాడారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుపై కక్ష సాధింపులకు ముఖ్యమంత్రి పాల్పడి అక్రమంగా అరెస్ట్ చేయించారన్నారు. చంద్రబాబు నాయుడుని విడుదల చేసేంత వరకు నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజు దీక్షలు బీసీ నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న, క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిపూటి రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీక్షలకు టిడిపి సీనియర్ నాయకులు సరిపూటి సూర్యనారాయణ, బాంబే డయింగ్ నాగన్న, వీరాంజనేయులు, పప్పూరి సుబ్బయ్య, మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి తదితరులు మద్దతుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, రాష్ట్ర నాయకులు దేవర్ల మురళి, తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, శివబాల, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, స్వప్న, తేజశ్విణి, జానకి, టిడిపి నాయకులు పోతుల లక్ష్మీ నర్సింహులు, కనుమ కొండయ్య, తమ్మినేని రఘు, ప్రగతి నారాయణస్వామి, బాబ్జి, ఓబులపతి, నాయి బ్రాహ్మణ, కడియాల కొండన్న, యూనిట్ ఇన్‌ఛార్జులు నారాయణస్వామి యాదవ్, సుధాకర్ యాదవ్, రజాక్, ఎన్‌బికె నారాయణస్వామి, సరిపూటి శ్రీకాంత్, మనోహర్, ఓబుల్ రెడ్డి, పూల బాషా గంగవరం బుజ్జి పాల్గొన్నారు.

రాయదుర్గంలో దీక్ష చేపట్టిన టిడిపి నాయకులు

తాడిపత్రిలో దీక్షలో పాల్గొన్న జెసి అస్మిత్‌రెడ్డి, మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు : టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును అరెస్టును నిరసిస్తూ పెద్దవడుగూరు మండల తెలుదేశం నాయకులు బుధవారం నాడు మండలంలో రిలే నిరాహారదీక్షలను ప్రారంభించారు. టిడిపి కార్యాలయం ముందు మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు చిరంజీవులు, హరికృష్ణారావు, వెంకటరామిరెడ్డి, నాగరాజు, నాగేశ్వరరెడ్డి, బాలరాజు తదితరులు దీక్షల్లో పాల్గొన్నారు. జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు ఆవులాంపల్లి కేశవరెడ్డి, మాజీ కన్వీనర్ బాలిరెడ్డి, నాయకులు సంకిరెడ్డి, ప్రసాద్ యాదవ్, లక్ష్మీనారాయణ దస్తగిరి, నరేంద్రరెడ్డి, రాము, నాగశేఖర తదితరులు మద్దతు ప్రకటించారు.

దీక్షలో పాల్గొన్న జెసి అస్మిత్‌రెడ్డి, మాట్లాడుతున్న పరిటాల సునీత

రాయదుర్గం : టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా బుధవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. దీక్షలో జిల్లా జడ్పి మాజీ చైర్మన్ పూల నాగరాజు, కౌన్సిలర్లు కురుబ ప్రశాంతి, జ్యోతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల వెంకటేశులు, మాజీ కౌన్సిలర్లు బండి భారతి, పి.పురుషోత్తం, ఇనాయత్‌బాషా, దబ్బిడి శివ, మల్లి, బుదూరు తిప్పేస్వామి, ఎల్లప్ప, ఆర్.రాజశేఖర్, బి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పట్టణంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఎం డౌన్ డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. నిజాయితీ పరుడైన చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టి వైసిపి నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల : శింగనమలలో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నరసానాయుడు, కేశవరెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి డేగల క్రిష్ణమూర్తి మాట్లాడుతూ సిఎం జగన్ నైతిక విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, చంద్రబాబు సిఎం కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో గార్లదిన్నె మండల కన్వీనర్ పాండు, గుర్రం ఆదినారాయణ, విశాలాక్షి, ఆవుల కృష్ణయ్య, గంజి నాగరాజు, గంగాధర్, ఎం.ఆదినారాయణ, మారుతినాయుడు, అబ్దుల్ జిలాని, గుర్రం ఆదినారాయణ, వెంకటేశ్వ రనాయుడు, మాసూల చంద్రమోహన్, కణంపల్లి సుధాకర్ రెడ్డి, నల్లప్ప, ఇల్లూరు రామాంజనేయులు, వన్నూరు, వడ్ల రాము, బాబయ్య, పాండు, నరేంద్రకుమార్ యాదవ్, సర్పంచి రాజు ఎర్రి నాగప్ప, పెద్దన్న, శివ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

గుత్తి : మండల పరిధిలోని తురకపల్లి గ్రామ సమీపంలో రైల్వే వంతెన వద్ద బుధవారం ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని కురుబవీధికి చెందిన శివలింగ(34) ఆటో డ్రైవర్‌గా ఉంటూ జీవనం కొనసాగించేవాడు. అనారోగ్య సమస్యలతో అతడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, హెడ్ కానిస్టే బుల్ వాసు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడికి భార్య, పిల్లలు కలరు. జీఆర్పీ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నీటి కుంటలో పడి బాలిక మృతి

తాడిపత్రి రూరల్ : నీటి కుంటలో పడి ఓ బాలిక మృతిచెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని చెల్లవారిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. చల్లవారిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఉషశ్రీ(9) పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి మృతి చెందింది. స్థానికుల సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు.. తప్పిన ప్రమాదం

రాయదుర్గం : ఓ ప్రయివేట్ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. రాయదుర్గం నుంచి కర్నాటకలోని మొలకాల్మూరు వైపు జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రయివేటు బస్సు వేగంగా వెళ్తూ 20వ వార్డులోని పైతోట సమీపంలో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఎదురుగా వస్తున్న మరో ప్రయివేటు బస్సును ఢీకొంది. ఈ సంఘటనలో విద్యుత్ స్తంభం విరిగి నేల కూలింది. మరో బస్సు స్వల్పంగా దెబ్బతింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రుణభారంతో ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

శింగనమల : మండల పరిధిలోని వెస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన కురువ నగేష్ గొర్రెలే జీవనాధారంగా జీవనం కొనసాగిస్తుండేవాడు. గొర్రెలు మేపుటకు, కుటుంబ అవసరాల కొరకు ప్రయివేట్ వ్యక్తుల వద్ద రూ. 24 లక్షల వరకూ అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో గొర్రెలను రూ. 14 లక్షలకు విక్రయించి ప్రతి ఒక్కరికీ రూ. 40 వేలు చొప్పున చెల్లించాడు. దీనికి తోడు ఉన్న ఇంటిని అప్పు ఇచ్చిన వారు రాయించుకున్నారని, ద్విచక్ర వాహనాన్ని కూడా తీసుకెళ్లారని వాపోయాడు. అయినా అప్పులు తీరలేదని అప్పుల బాధ తాళలేక శింగనమల చెరువులో దూకెందుకు భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి వచ్చినట్లు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో స్పందించిన పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వారిని స్టేషన్‌కి తీసుకెళ్లారు.

మద్యం కేసులో పట్టుబడిన వాహనాలకు వేలం

గుమ్మగట్ట : వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఈ నెల 15వ తేదీ వేలం వేస్తున్నట్లు ఎస్ఐ సునీత తెలిపారు. ఆమె మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో మద్యం కేసులో పట్టుబడిన ఒక కారు, 9 మోటార్ సైకిళ్లను 15వ తేదీ ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు టోకెన్ ఫీజు చెల్లించి ఆధార్, పాన్ కార్డు తీసుకొచ్చి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని నిట్టూరు బస్టాండ్ సమీపంలో బుధవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నై పట్టణం నుంచి ఆదోనికి ప్రయాణికులతో వెళ్తున్న కారును నిట్టూరు వద్ద ఎదురుగా వస్తున్న ఓ టిప్పర్ బలంగా ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు పక్కకు వెళ్లి ప్రమాదానికి గురైంది. తీవ్ర గాయాలతో ఉన్న వారిని వెంటనే ఓ వాహనంలో యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

విద్యార్థి సి.భరత్‌తో పాఠశాల యాజమాన్యం

కబడ్డీలో 'సాయివిజ్ఞాన్' విద్యార్థి ప్రతిభ

అనంతపురం : నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాల విద్యార్థి సి.భరత్ అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో మంగళవారం కబడ్డీ పోటీలు జరిగాయి. ఇందులో సి.భరత్ ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి అండర్-17 పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఎంపి శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతో పాటు క్రీడల్లో నూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. పోటీలకు ఎంపికైన సి.భరత్‌ను అభినందిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.లావణ్యరామ్, పిఇటి వన్నూరుస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

నార్పల : గణేష్ ఉత్సవాల్లో భాగంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఉత్సవ కమిటీలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అలాగే ఉత్సవ కమిటీ సభ్యులు పాటించాల్సిన నియమ నిబంధనలు, జాగ్రత్తలను సూచించారు. మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వివరాలు స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే నిర్వాహకులు, కమిటీ సభ్యులదే బాధ్యత అన్నారు.

బుక్కరాయసముద్రం : వినాయక చవితి ఉత్సవాలకు నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఇటుకలపల్లి ఎస్ఐ రుషేంద్రబాబు స్పష్టం చేశారు. అలాగే ఉత్సవ కమిటీ సభ్యులు పాటించాల్సిన నియమ నిబంధనలు, జాగ్రత్తలను సూచించారు.

ఇళ్ల పట్టాల కోసం ధర్నా

నార్పల : స్థానిక సిపిఐ కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ అర్హులకు ఇంటి పట్టాలు ఇవ్వాల ని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించు కోవడంలేదని మండిపడ్డారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నియోజక వర్గ కార్యదర్శి కత్తి నారాయణస్వామి, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రాము, మండల కార్యదర్శి గంగాధర, సహాయ కార్యదర్శి రమేష్, రైతు సంఘం మండల కార్యదర్శి జోసప్ప, లలితమ్మ, కార్యదర్శి నాగరాజు, పెద్దన్న, నారాయణప్ప, గూగూడు పెద్దక్క, తదితరులు పాల్గొన్నారు

శ్రీవారి సన్నిధిలో సాంబశివారెడ్డి

శింగనమల : రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి బుధవారం తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లండన్ పర్యటన ముగించుకొని తిరిగి వచ్చిన సిఎం జగన్ 2024 ఎన్నికల్లో విజయం సాధించి మరోమారు ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, బొమ్మన శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో సాంబశివారెడ్డి, తదితరులు

జనవరి నుంచి పింఛన్ రూ.3వేలు

ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

రానున్న జనవరి నుంచి పింఛన్ మొత్తం రూ. 3 వేలకు పెరుగుతుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రా రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా మంజూరైన 386 పింఛన్లను బుధవారం పట్టణంలోని వారపు సంత మైదానం వద్ద ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప అధ్యక్షతన ఎమ్మెల్యే కాపు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా కాపు మాట్లాడుతూ టిడిపి పాలనలో పింఛన్లకు రూ. 400 కోట్లు ఖర్చు పెడుతుండగా ప్రస్తుతం రూ. 1800 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో పింఛను మంజూరు కావాలంటే లంచం ఇవ్వాలని, ఆఫీసుల చుట్టూ తిరగాలని, లేదంటే ఎవరో చావాల్సిన దుస్థితి ఉండేదన్నారు. నేడు అవినీతికి తావులేకుండా అర్హులందరికీ ఇంటి వద్దకే అందుతుందన్నారు. ఈ నాలుగేళ్లలో తాను ఏం చేశానో వివరిస్తానని, కాలవ శ్రీనివాసులు తన ఐదేళ్ల పదవీకాలంలో ఏంచేశారో ప్రజలకు చెప్పాలన్నారు. జగన్ లేకుంటే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని

పింఛన్లు పంపిణీ చేస్తున విప్ కాపు రామచంద్రారెడ్డి

కావున వైసిపిని మరోమారు ఆశీర్వదించాలన్నారు. అబద్దాలకు మారుపేరైన చంద్రబాబును నమ్మవద్దని ప్రజలకు సూచిం చారు. ఫైరపర్సన్ శిల్ప, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి టిడిపి పాలనకు, జగన్ పాలనకు తేడాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, మేనేజర్ ప్రసాద్, కౌన్సిలర్లు నాగవేణి, గోవిందరాజులు, శ్రీలక్ష్మి, పద్మజ, లావణ్య, గోవింద, సంజీవ, వన్నూరుస్వామి, చెన్నవీరస్వామి, శ్రీనివాస రెడ్డి, శారద, ఫకృద్దీన్, ఉష, నాయకులు తిమ్మారెడ్డి, శివ, రవి, దివాకర్, నిజాముద్దీన్, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల దీక్షపై స్పందించకపోవడం దారుణం

ప్రజాశక్తి-తాడిపత్రి

భవన నిర్మాణ కార్మికులు పట్టనంలో మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణమని సిపిఎం, సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్ పేర్కొన్నారు. కార్మికుల దీక్షకు బుధవారం వారితో పాటు సూరి, సత్యం సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మిక లకు సంక్షేమ పథకాలు ఎందుకు అందట్లేదో తెలియ జేసే వరకు కార్మికులతో కలిసి పోరాడుతామని తెలి పారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు వెంకట్, కార్పెంటర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నబిరసూల్, బేల్దారి అసోసియేషన్ అధ్యక్షులు గంగయ్య, ఉపాధ్యక్షులు నాగరాజు, టౌన్ కార్పెంటర్ అసోసి యేషన్ అధ్యక్షులు శివకుమార్, ఉపాధ్యక్షులు జక్కన్న, గ్రానైట్ అండ్

కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న సిఐటియు, సిపిఎం నాయకులు

ఫ్లోరింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గౌస్ బేగ్, సెక్రటరీ పామిడి హాజీ టౌన్ అసోసియేషన్ కమిటీ సెక్రెటరీ ఎంసి. రాజు, శివశంకర్, పెయింటర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు, సెక్రటరీ జమాల్ వలి, జాయింట్ సెక్రటరీ నందగోపాల్, పెయింటర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-నార్పల

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు రవికుమార్ తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 9 క్రీడాంశాలకు సంబంధించి నాలుగు విభాగాలుగా అండర్-14 బాల బాలికలు, అండర్-17 బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒ కృష్ణయ్య, హెచ్ఎం రవికుమార్ హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎంఇఒ మాట్లాడుతూ మండలం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదిగారని, అదే స్ఫూర్తితో మీరు ఉన్నత స్థాయికి ఎదగాలని

క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆకాంక్షించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు చదువు, ఆటలు రెండు కళ్లు లాంటివన్నారు. చదువు జ్ఞానాన్ని పెంచితే ఆటలు ఆరోగ్యాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాసులు, శ్రీదేవి, నసీమ, సుజాత, కాటమయ్య, మల్లికార్జున, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం

అపుస్మా జిల్లా అధ్యక్షులు పుల్లారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రయివేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యాల్లో ఐక్యత అవసరమని ఎపి ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కె.రామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం ఉరవకొండ ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు రఘురాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో మండల పరిధిలోని ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లా డుతూ ప్రయివేట్ పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని

సమావేశమైన ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు

వాటిని ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించుకో వలసిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి యూనియన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్ర జనరల్ బాడీ సమావేశాలు విజయవాడలో జరుగుతున్నాయని, కరస్పాండెంట్లు, ప్రతినిధులు తప్పక హాజరవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు పామిడి సలీం, నిజాం, కిరణ్‌కుమార్, నాగరత్న, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఈ క్రాప్ బుకింగ్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. మండల పరిధిలోని షేక్‌పల్లి, గార్లదిన్నె గ్రామాల్లో జరుగుతున్న ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నిర్వహించాల ని అధికారులకు సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల కొరత రాకుండా చూసుకోవాల న్నారు. పిఎం కిసాన్ ల్యాండ్ లింకేజ్, ఎన్‌పిసిఐ ఇన్ యాక్టివ్ ఉన్నటువంటి రైతులు ల్యాండ్ లింకేజీ, ఎన్‌పిసిఐ యాక్టివ్ చేసుకో వడం వల్ల వారు పిఎం కిసాన్ అర్హులుగా గుర్తింపబడుతారని తెలిపారు. కౌలు రైతులను జెఎల్‌జి గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి బ్యాంకు లో రుణ సదుపాయం కల్పించాలన్నారు. ఆమె వెంట ఎడిఎ చంగల్రాయుడు, ఎఒ ఆంజనేయులు, డిఆర్సి ఎఒ శంకర్‌లాల్‌నాయక్, టెక్నికల్ ఎఒ కిరణ్ కుమార్ రెడ్డి, ఎఇఒ ఆదినారాయణ, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న జెడిఎ ఉమామహేశ్వరమ్మ

ఎన్ఎంయుకు గుర్తింపుపై సంబరాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎపి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ విభాగంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ(ఎన్ ఎంయూ) అసోసియేష న్‌కు ప్రభుత్వ గుర్తింపు దక్కడం పట్ల బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద అసోసియేషన్ సభ్యులు గేట్ మీటింగ్ నిర్వహించి సంబరాలు చేసుకొన్నారు. ప్రభుత్వం నుంచి గుర్తింపు రావడం పట్ల రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగరాజు, జోనల్ జాయింట్ సెక్రటరీ ఎం.నాగరాజు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు జిలాన్, తిప్పేస్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గుర్తింపు పత్రాలను ఉద్యోగులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు పి.సతీష్ కుమార్, దూద్‌పేరా, నాయకులు సుబ్బరాయుడు ప్రకాష్, చంద్రశేఖర్, రమేష్, దామోదర్, తిమ్మరాజు, జగదీష్, ప్రసాద్, మల్లప్ప, వలి, సూరిబాబు, గోపి, రామాంజనేయులునాయక్, మాలిక్ బాషా, అజయ్‌బాబు, మస్తాన్, హెచ్ఎం రావు, వలి, సత్తార్‌ఖాన్, విజయ్, షబ్బీర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రత్యేక స్పందనలో అర్జీల వెల్లువ

పెద్దపప్పూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఆర్‌డిఒ మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో 80 అర్జీలు అందాయి. ముఖ్యంగా రీ సర్వే, రెవెన్యూ సంబంధిత సమస్య లపై ఎక్కువ అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ఎమ్మార్పీఎస్, సిపిఐ నాయకు లు ఆర్డీఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డిఎస్ఒ శోభారాణి, పిడి నరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా సర్వేయర్ రాంప్రసాద్, ఎస్‌బి డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

15న అగ్రిగోల్డ్ బాధితుల చలో విజయవాడ

ఉరవకొండ:అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై ఈ నెల 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వస్తున్నట్లు అగ్రి గోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దేశ్వర పిలుపునిచ్చారు. అగ్రి గోల్డ్ బాధితుల శంఖారావ దీక్షకు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభకు బాధితులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తలారి మల్లికార్జున, మండల ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షులు తిమ్మరాజు, బాధితులు మల్లేష్, రంగస్వామి, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ఉరవకొండ : రైతన్నలకు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉండే విధంగా ఎరువులు సరఫరా చేస్తున్నట్లు ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర్ పేర్కొన్నారు.బుధవారం మండల పరిధిలోని రాకెట్ల గ్రామం రైతు భరోసా కేంద్రంలో ఉన్న ఎరువులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమిద్యాల రాకెట్ల రైతు భరోసా కేంద్రం సిబ్బంది మీనాక్షిసోము,రామ్మూర్తిరైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలి

గార్లదిన్నె: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని మానసిక ఒత్తిడి నుంచి బయటపడాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానసికంగా ఎదుర్కొంటున్న పరిస్థితులు, అందుకుగల కారణాల గురుంచి తెలిపారు. విద్యార్థులు ఏదైనా సమస్యతో బాధపడుతుంటే తల్లిదండ్రులకు తప్పక తెలియజేయాలన్నా రు. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని, ముఖ్యంగా సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుంకన్న, సిహెచ్ఒ లోకనాథ్, పిహెచ్ఎన్ అరుణకుమారి, ఎఎన్ఎం సావిత్రమ్మ పాల్గొన్నారు.

వేగవంతంగా ఈ క్రాప్ బుకింగ్

బొమ్మనహాల్ : మండల వ్యాప్తంగా వ్యవసాయ అధికారులు ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేసినట్లు ఎఒ సాయికుమార్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అన్ని ఆర్‌బికెల పరిధిలో క్రాప్ బుకింగ్ వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ అధికారులు పొలాలకు రావడం వల్ల యాప్ పనిచేయడం లేదు, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై ఎఒ మాట్లాడుతూ రైతులందరివీ పూర్తి చేయడానికి శక్తి వంచన లేకుండా పని చేస్తామని తెలిపారు.

ఈ క్రాప్ నమోదు గడువు పొడిగింపు

ఉరవకొండ : 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్ నమోదును వేగవంతంగా పూర్తి చేయాలని విడపన కల్లు, ఉరవకొండ మండలాల ఎఒలు పెన్నయ్య, శుభకర్ పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు గడువును ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాల్తూరు గ్రామంలోని రైతు బావిగడ్డ సురేష్ సాగు చేసిన మిర్చి పంట నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన

అనంతపురం జగన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పుట్లూరులో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి -అనంతపురం

ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం నగరంలోని 58వ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన 'జగనన్న ఆరోగ్య సురక్ష' పై సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి వాలంటీర్లు ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు భాగస్వాములై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తారనా అందులో స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో అందిన సమస్యలు, పరిష్కార చర్యలపై ఎమ్మెల్యే సమీక్ష చేశారు. సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆత్మకూరు : 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వైద్యులు దయాకర్, సబిహా సుల్తానా ఆధ్వర్యంలో ఫీల్డ్ లెవెల్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ నుంచి వాలంటీర్స్ క్షేత్రస్థాయిలో వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, తహశీల్దార్, ఎంఇఒ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, వాలంటీర్స్, తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ అధికారి శంకరయ్య హాజరై మాట్లాడుతూ ఎఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పిలు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్‌కుమార్ రెడ్డి, తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర, హౌసింగ్ ఎఒ శివారెడ్డి, పంచాయతీ సెక్రటరీ వెంకటేశులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : స్థానిక ఐకెపి కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహ న సదస్సు నిర్వహించారు. వైద్యురాలు శ్రీవాణి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ ఇంటింటికి వెళ్లి బాధితులను గుర్తించి హెల్త్ క్యాంపునకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, డిటి మల్లేష్ ప్రసాద్, ఇఒఆర్‌డి ఆనంద్ ప్రసాద్, ఎంఇఒ శ్రీదేవి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : ఈ నెల 15 నుంచి 30 తేదీ వరకూ చేపడుతున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష'పై బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన వివిధ శాఖల మండల అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పి వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ హరికుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు కూడా ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని కోరారు.

గార్లదిన్నె : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ తేజోష్ణ ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శాంతి, వైద్యాధికారి డాక్టర్ షమీన్ తాజ్, సిహెచ్ఒ లోకనాథ్, మండల పరిధిలోని సెక్రటరీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఎఎన్ఎంలు, పంచాయితీ కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు విని కష్టాలు తెచ్చుకోవద్దు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి- నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-డి.హీరేహాల్

టిడిపి అధినేత చంద్రబాబు మాటలు విని కష్టాలు కొని తెచ్చుకోవద్దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి హితవు పలికారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ అధ్యక్షతన వైఎస్ఆర్ పెన్షన్ కానుక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాపు మండలంలో నూతనంగా మంజూరైన 346 పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అధికారం కోసం టిడిపి నాయకులు కల్లిబల్లి మాటలు చెబుతున్నారని, వారి మాటలు వినవద్దని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి హసీనాబాను, వైస్ ఎంపిపి లింగప్ప, వైసిపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి, సర్పంచులు లక్ష్మి, బోయ మల్లికార్జున, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చంద్ర, బోయ నాగరాజు, రహంతుల్లా, జగదీష్, కాశీంపీరా, తదితరులు పాల్గొన్నారు

ఉరవకొండ : వైసిపి ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసిందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలానికి మంజూరైన 619 నూతన పింఛన్లను బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న వైసిపికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అమృత్ రాజ్, ఇన్‌ఛార్జి ఇఒ రమణ, సర్పంచి లలిత, వైస్ ఎంపిపి నరసింహులు, ఉప సర్పంచి వన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప : మండల వ్యాప్తంగా కొత్తగా 361 పింఛన్లు మంజూరయ్యిని ఎంపిడిఒ రామచంద్ర తెలిపారు. అందులో 20 పింఛన్లను బుధవారం నక్కలపల్లి సర్పంచి ఊరు వాకిలి రామిరెడ్డి పంపిణీ చేశారు. అంతకుముం దు

డి.హీరేహాల్‌లో పింఛన్లు అందిస్తున్న కాపు రామచంద్రారెడ్డి

నక్కలపల్లి గ్రామంలో సర్పంచి రామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించా రు. అలాగే స్థానిక సచివాలయం-1లో 25 పింఛన్లను సర్పంచి సాలిబాయి పంపిణీ చేశారు. మిగిలిన సచివాలయాల్లో ఆయా పంచాలయతీల సర్పంచులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : మండల పరిధిలోని బసినేపల్లి తండాలో సర్పంచి ఆర్.సుశీలమ్మ, ఎంపిటిసి శంకరమ్మ కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ లాలునాయక్, వైసిపి నాయకులు వలినాయక్, పద్మనాయక్, కృష్ణనాయక్, గంగులనాయక్, జగన్‌నాయక్, సచివాలయ సంక్షేమ కార్యదర్శి రమణ, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 23వ వార్డుకు సంబంధించిన సచివాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి నూతన పింఛన్లను పంపిణీ చేశారు. 22వ వార్డులో కౌన్సిలర్ ఎం.సులోచన, సచివాలయాల కన్వీనర్ ఎం.రంగస్వామి పింఛన్లను అందజేశారు. ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేవారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు వినయ్ కుమార్, ఫయాజ్, షరీఫ్, గంగాధర్ పాల్గొన్నారు.

శింగనమల : కొత్తగా మంజూరైన పింఛన్లను బుధవారం మండల పరిధిలోని సి.బండమీడపల్లి సచివాలయంలో ఎపి నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ సిహెచ్.ప్రమీల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ వెంకటరమణ, చక్రాయపేట సర్పంచి సి.సరోజమ్మ, మండల మహిళా కన్వీనర్ రమా దేవి, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి సాకే లోకనాథ్, నాయకులు చిన్న తిరుపతయ్య, ఆదినారాయణరెడ్డి, లింగమ య్య, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అబ్బి చేకూర్చడమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం పనిచేస్తుందని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పవతి బీమ్‌రెడ్డి పేర్కొన్నారు. విడపనకల్లుతో పాటు గడేకల్ గ్రామంలో బుధవారం ఎంపిపి ఆధ్వర్యంలో నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషే కం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, సుంకన్న, గిరిబాబు, ఇఒపిఆర్‌డి సత్యబాబు, ఎంపిటిసి తిమ్మరాజు, సర్పంచులు సుశీలఉమాశంకర్, దేవరాజ్, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండల వ్యాప్తంగా కొత్తగా 354 పింఛన్లు మంజూరైనట్లు ఎంపిడిఒ కొండయ్య తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు బుధవారం కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నేడు పింఛన్లు పంపిణీ

నార్పల : మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని సచివాలయాలు-1, 2, 3, 4 పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను గురువారం(నేడు) స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని మేజర్ పంచాయతీ కార్యదర్శి అశ్వత్థనాయుడు తెలిపారు. సంబంధిత గ్రామ వాలంటీర్లు నూతన పింఛన్ లబ్ధిదారులను పంపిణీ కార్యక్రమానికి తీసుకురావాలని సూచించారు. ముఖ్యఅతిథిగా అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంపిడిఒ దివాకర్, జడ్పి వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, సర్పంచి సుప్రియ, ఉపసర్పంచి గవ్వల శ్రీరాములు, ఎంపిటిసి సభ్యులు, వార్డు మెంబర్లు, తదితరులు హాజరవుతారని తెలిపారు.